మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో నడుస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం నియోజకవర్గ మహిళలకు ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి అన్నారు. మంగళగిరి పట్టణం, రూరల్ మండ లాల్లో కుట్టుమిషన్ శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు ఎమ్మెస్సెస్ భవన్‌లో తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 26వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 40 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, తెలుగు మహిళ నాయకులు గద్దం లక్ష్మిసామ్రాజ్యం, వాసా పద్మ, యలమంచిలి పద్మజా, సింహాద్రి బేబిరాణి, మోతుకురి సుజాత, దివి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పోలిమెట్ల రుద్ర కోటేశ్వర రావు సహకారంతో తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో చిరు వ్యాపారం చేసుకొనే 20 మందికి తాడేపల్లి పట్టణ టీడీపీ కార్యాలయం ఎదుట 10 తోపుడు బండ్లు, 7 టిఫిన్ బండ్లు, 3 రిక్షా బండ్లు అందజేశారు. ఈ సందర్భంగా వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంతో పనిచేస్తామని అన్నారు. నారా లోకేష్ సహకారంతో నియోజకవర్గంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడి సత్యనారాయణ, కొయ్యగూర మహాలక్ష్మి, కాటాబత్తని నిర్మల, చిన్నపోతుల చిన్న, ఇట్టా భాస్కర్, ఉయ్యాల కోటేశ్వరరావు, అన్నెం కుసుమ, గోలి శౌరి, అద్దంకి మురళి, దానబోయిన సుందరరావు యాదవ్, చాంద్ బాషా, జి.నాగేశ్వరరావు, మండవ గోపాలరావు, పీటర్ పాల్, జి.శ్రీనివాస్, పోటాబత్తని శ్రీనివాస్, కొయ్యగోర మల్లేశ్వరరావు, దర్శి హరికృష్ణ, షేక్ మస్తాన్ వలి, కాటాబత్తిని సాగర్, సింహచలం తదితరులు పాల్గొన్నారు.

కాయ దశకు జూటు పంట



విశాలాంధ్ర-తాడికొండ : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులు వేసిన జూటు పంట కాయ దశకు చేరింది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా మండలంలో 499 ఎకరాలలో జూటు పంట సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో పంట ఏపుగా పెరిగింది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఎకరాకు ఆరు నుంచి 9 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది.

కాలేజీలో మెషిన్ లెర్నింగ్ వర్క్‌షాప్

విశాలాంధ్ర, తెనాలి : నన్నపనేని వెంకట్రావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో గత రెండు రోజులుగా మెషిన్ లెర్నింగ్ మీద వర్క్‌షాప్ జరిగింది. ప్రముఖ కంపెనీ డెటా పాయింట్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ మెషిన్ లెర్నింగ్ టెక్నికల్ సభ్యులు శబరినాథ్ సారథ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతను విద్యార్థులకు అందివ్వడంలో కళాశాల యాజమాన్యం ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. ఈ కార్యసాధన వలన విద్యార్థులు నైపుణ్యంపై ప్రావీణ్యం సంపాదించుకొని రానున్న రోజుల్లో మంచి ఉద్యోగావకాశాలను పొందాలని సూచించారు.

కె.చంద్రకళ పీజీ కాలేజీలో ఫ్రెషర్స్ డే

విశాలాంధ్ర, తెనాలి : కొత్తమాసు చంద్రకళ పిజి కళాశాలలో 2023-2024 విద్యాసంవత్సరానికి యం.సి.ఎ.లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.జె.ఎన్.వి. నరేష్‌బాబు మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసిస్తూ మంచి క్రమశిక్షణతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎన్.ఆర్.కె. & కె.ఎస్.ఆర్ గుప్తా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు విద్యాసంస్థలు విద్యతోపాటు ఉద్యోగ అవకాశాలు కూడా అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు విద్యాసంస్థల మేనేజర్ ధూళిపాళ్ళ శ్రీనివాసరావు, గడ్డిపాటి భారతి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మాదిగల పాదయాత్ర జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-ఫిరంగి పురం: ఎస్సీ వర్గీకరణను సాధించుకోవడం ద్వారా మన పిల్లలు అభివృద్ధిలోకి వస్తారని లేదంటే రిజర్వేషన్‌ల సమస్యలు ఎదుర్కోవలసిన పరిస్థితులు తప్పవని ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు పల్లెపోగు థామస్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించాలని కోరుతూ శనివారం మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామంలో మాదిగల విశ్వరూప మహా పాద యాత్రను ప్రారంభించి బేతపూడి, గుండాలపాడు, మునగపాడు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి థామస్ మాట్లాడుతూ నవంబర్ 4వ తేదిన చలో హైదరాబాదు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎంఆర్పీయస్ నాయకులు యం.వెంకటేశ్వరావు జిల్లా ఇన్‌చార్జి, పల్లెపోగు రాజారావు, మేకల జోజి, యద్దనపూడి జ్యోతి, యద్దపల్లి కోటేశ్వరావు, కంభంపాటి రాంబాబు, గుడిపూడి యోహాను, జంగాల శ్రీనివాసరావు, కంభంపాటి మధు, జొన్నల గడ్డ ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలలో ఆయుష్మాన్ భవ వైద్య సేవలు

విశాలాంధ్ర-పొన్నూరు : నిడుబ్రోలు ప్రభుత్వ వైద్యశాలలో ఆరోగ్య మేళా ఆయుష్మాన్ భవః కార్యక్రమంలో భాగంగా శనివారం గర్భిణీ, బాలింతలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది గర్భిణీ, బాలింతలకు స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం అందించి మందులు పంపిణీ చేశారని సూపరింటెండెంట్ డాక్టర్ రేష్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల కమిటీ సభ్యుడు కొల్లేరు శ్రీనివాసరావు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

అరవిందలో ఆకట్టుకున్న దసరా

విశాలాంధ్ర-తాడేపల్లి : మన దేశ సంస్కృతి, సంప్రదాయం, పండుగ ఆచారాలు పాఠాల రూపంలోనే కాదు పిల్లలకు ప్రత్యక్షంగా తెలియజేయడానికి నాటికలు, పాటలు, నృత్యాల ద్వారా స్థానిక కుంచనపల్లిలోని అరవింద ఉన్నత పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. ఈనాటి కార్యక్రమాన్ని జరుపుటకు ముందుగా పాఠశాల వేదికను చాలా అందంగా పండుగ వాతావరణం తలపించేలా అలంకరించారు. పిల్లలు పండుగ సందర్భం పాటలను పాడగా, ఉపాధ్యాయులు పండుగ ప్రాముఖ్యతను వివరించగా, కథలా చెప్పిన అంశాన్ని నృత్య ప్రదర్శన, నాటక ప్రదర్శన ద్వారా తెలియపరిచే ప్రయత్నం కూడా చేశారు. అంతేకాక ఈ పండుగలో గల ముఖ్య పాత్ర పరిశీలన, అవగాహన కలిగించారు. ప్రిన్సిపాల్ ఇంద్రాణి పిల్లలతో ముచ్చటిస్తూ ఈ పండుగను సంప్రదాయపరంగా కాక ప్రకృతి పరంగామనం జరుపుకోవలసిన అవసరం ఉందని వివరించారు.

మోదీ ఆదేశాలతోనే విద్యుత్ చార్జీల పెంపు: వామపక్షాలు

విశాలాంధ్ర-గుంటూరు : గతంలో రెండేళ్లకు మూడేళ్లకు కరెంటు చార్జీలు పెంచే వారని, నేడు మోదీ ఆదేశాలకు లొంగి జగన్ ప్రభుత్వం ప్రతి నెల వంట గ్యాస్ లాగానే కరెంటు చార్జీలు కూడా పెంచడాన్ని సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు కోట మాల్యాద్రి, కె.నళినికాంత్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంటు చార్జీల పెంపును నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం గుజ్జనగుండ్ల సెంటర్‌లో ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కరెంటు బిల్లులే కాకుండా ఫిక్స్‌డ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, సర్ చార్జీలు, విద్యుత్ సుంకం, ఇంధనం చార్జీలు, సర్దుబాటు చార్జీలు ఇలా రకరకాల పేర్లు పెట్టి ప్రజల నడ్డివిరుస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు తిరుగుబాటు చేసే సమయం ఆసన్నమైందని వారన్నారు. కరెంటు చార్జీలు పెంచడం ద్వారా గత ప్రభుత్వాలకు అధికారాన్ని దూరం చేసిన ప్రజలు ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాలను గద్దెదించడానికి సంసిద్ధమవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా తమ విధానాలు మార్చుకొని విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, అలాగే నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు సంగిరెడ్డి హనుమంత్ రెడ్డి, నూతలపాటి చిన్న, పచ్చల శివాజీ, కొల్లి రంగారెడ్డి, ఎం.మురళి, అకిటి రామచంద్రుడు, గోగినేని వెంకట్రావు, ధూపాటి వెంకటరమణ, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, సీపీఎం నాయకులు నికల్సన్, షకీలా, కాసిం తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుల నడ్డి విరుస్తున్న విద్యుత్ బిల్లులు

విశాలాంధ్ర-మంగళగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు చార్జీల బాదుడుతో సామాన్యుల నడ్డివిరుస్తున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో మంగళగిరి మిద్దె సెంటర్లో శనివారం ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీల పేరుతో సామాన్య ప్రజలను దోచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజా బ్యాలెట్‌లో 210 ఓట్లు పోలవగా 209 ఓట్లు కరెంట్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా వచ్చాయి. ఒక్క ఓటు మాత్రం కరెంట్ చార్జీల పెంపుదలకు అనుకూలంగా వచ్చిందని అన్నారు. ఎన్నికల ముందు బహిరంగ సభల్లో రూ.500, రూ.600 కరెంటు బిల్లు వస్తేనే సామాన్య ప్రజలు ఎలా కడతారని అడిగిన ఈనాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత సర్దుబాటు చార్జీలు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుతో ప్రజలపై అదనపు భారాన్ని మోపుతూ విద్యుత్ రంగాన్ని ఆదాని తదితర బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబట్టేందుకు చూస్తున్నా రని అన్నారు. బడా కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కై విద్యుత్‌ను బహిరంగ మార్కెట్లో రూ.10 నుంచి రూ.20లకు కొంటున్నారని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లా డుతూ 200 యూనిట్లు లోపు విద్యుత్ వాడే వారందరికీ ఉచిత విద్యుత్తు ఇస్తామని చెప్పిన జగన్ ఆ హామీని నీరు కారుస్తున్నారన్నారు. విద్యుత్ చార్జీల పెంపును రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, అన్నవరపు ప్రభాకర్, నందం బ్రహ్మేశ్వర రావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, జాలాది జాన్ బాబు, జవ్వాది సాంబశివరావు, గుంటక సాంబిరెడ్డి, చిన్ని సత్యనారాయణ, ఎస్కే కరీముల్లా, బుర్ల శ్రీనివాసరావు, యార్లగడ్డ శివ గోపి, మత్తే అభిషేక్, ఆళ్ళమూడి హనోక్ బాబు, సీపీఎం నాయకులు జేవీ రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ, ఎం.ఫకీరయ్య, వై.కమలాకర్, ఎం.బాలాజీ, రామారావు, సీపీఐ (ఎంఎల్) నాయకులు కె.కోటేశ్వరరావు, ఆదినారాయణ, దుర్గాప్రసాద్, అంజిరెడ్డి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సైదారెడ్డి కుటుంబసభ్యులకు పురందేశ్వరి పరామర్శ

విశాలాంధ్ర-గుంటూరు : బీజేపీ సీనియర్ నేత కాయితి సైదారెడ్డి కుటుంబసభ్యులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు శనివారం గుంటూరులో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైదారెడ్డి మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. సైదారెడ్డి మృతి బీజేపీకి తీరని లోటుగా భావిస్తున్నానన్నారు. పార్టీకి అంకితభావంతో పనిచేసిన నేత సైదారెడ్డి అని గుర్తుచేశారు. కాయితి సైదారెడ్డి సతీమణి రమాదేవి, కుమారుడు ప్రదీప్ దత్తులను పరామర్శించిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర కుమార్, పాతూరి నాగభూషణం, షేక్ బాజీ, నూతలపాటి బాల, ఈదర శ్రీనివాసరెడ్డి, రాచుమల్లు భాస్కర్, అప్పిశెట్టి రంగా, వెలగలేటి గంగాధర్, విస్తారక్ రమేష్, ఉడతా నరసింహారావు, తోట శ్రీనివాస్, హనుమంతరావు, చలపతి తదితరులు ఉన్నారు.

నూరు బాషాల సింహ గర్జన జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ నూర్ బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఏసీ కళాశాల మైదానంలో సింహ గర్జన సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్ మహమద్ ఖాజావలి, నగర అధ్యక్షుడు షేక్ ఆదాం షఫీ, వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ స్టార్ మస్తాన్ తెలిపారు. స్థానిక గోరంట్లలోని ఉడ్‌లాండ్ హోటల్లో సభ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది తమ సంఘీయులు ఉన్నప్పటికీ నేటికి ఏటువంటి రాజకీయ గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వచ్చే ఎన్నికల్లో తమకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించే పార్టీకి మద్దతు ఇస్తామని వారు తెలిపారు. 76 ఏళ్లుగా తాము వివిధ పార్టీలకి మద్దతు ఇస్తే ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా తమ సంఘీయులను చట్ట సభలకు పంపలేదన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు డాక్టర్ మస్తానమ్మ, 10వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మీరావలి, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర-తుళ్లూరు : చంద్రబాబుకు మెరు గైన వైద్య సేవలను అందించాలని తుళ్లూరు మండల టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేశారు. చంద్రబాబుపై అక్ర మ కేసులు బనాయించి చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కేవలం రాజకీయ కక్షతోనే జైల్లో నిర్బంధించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జెడ్ ప్లస్ కేటగిరి ఉన్న వ్యక్తికి సరైన సదుపాయాలు కల్పించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. తుళ్లూరు మండలంలో మెయిన్ సెంటర్ వద్ద టీడీపీ నాయకులు రోడ్డుమీద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నది పరివాహక ప్రాంతాల్లో కార్డన్ సర్చ్

విశాలాంధ్ర-తాడేపల్లి : విజయవాడ క్లబ్, కృష్ణా నది పరివాహక ప్రాంతంలో పోలీసులు శనివారం సాయంత్రం కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఎస్పీ అరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో 40 మంది సిబ్బందితో పోలీసులు తనిఖీలు చేపట్టారు. నదీ తీరంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలువురు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పలు ద్విచక్ర వాహనాల రికార్డులను పరిశీలించారు. అపరిచిత వ్యక్తుల కదలికలపై సమచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు కట్టడి చేసేందుకు కార్డన్ సర్చ్ నిర్వహించినట్లు తాడేపల్లి సీఐ శేషగిరిరావు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు వినోద్, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-తాడేపల్లి : పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కేసీడబ్ల్యూఈఈఎస్ ఉన్నతపాటశాలలో 77-87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సూరిబాబు, టి.నాగేశ్వరరావు(టీఎస్ఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ రెడ్డి, వెంకటేశ్వరరావు, ధనలక్ష్మి, సుజాత, ఆనంద్, దుర్గారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలు పరిశీలించిన ఆలపాటి

విశాలాంధ్ర, తెనాలి : కొలకలూరు, కాజీపేట, హాఫ్‌పేట గ్రామ పరిసర ప్రాంతాల్లో శనివారం మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంట పొలాలను పరిశీలిం చారు. ఆయన మాట్లాడుతూ పంటపొలాలకు నీరు అందక రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారని ఇది చాలా బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలా ఇబ్బందులపాలు చేస్తుందని ఇది సహించరాని విషయమని చెప్పారు. ఈ సమయంలో రైతులకు అన్నివిధాలా సహాయసహకారాలు అందించకుండా ఏవేవో గొప్ప కార్యాలు నిర్వహిస్తున్నామని, ప్రజలకు అండదండలుగా ఉంటున్నామని సభల్లో మాట్లాడడం, పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం శోచనీయమన్నారు. టీడీపీ హయాంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగజేయలేదని, ముఖ్యంగా రైతులకు అండదండలుగా నిలిచిందని చెప్పారు. భవిష్యత్తులో ఈ ప్రభుత్వం పతనం ఖాయమని రైతులు, ప్రజలు వారికి తగిన శాస్తి జరపాలని చెప్పారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

శరన్నవ రాత్రుల బ్రోచర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అష్టైశ్వర్యాలను ప్రసాదించే జగన్మాతగా చుట్టుగుంట పోలేరమ్మ తల్లి పూజలందుకుంటున్నట్లు ప్రభుత్వ విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. ఎంతో ప్రాశస్త్యం గల పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ ఆదివారం నుంచి 23వ తేదీ వరకు శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతాయన్నారు. చుట్టుగుంటలోని పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ఉత్సవాలకు సంబంధించి బ్రోచర్‌ను స్థానిక పెద్దలు, దేవస్థానం కమిటీ సభ్యులు, జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులుతో కలిసి అప్పిరెడ్డి ఆవిష్కరించారు. పోలేరమ్మ తల్లిని భక్తిశ్రద్ధలతో దర్శించి, తరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, 24వ డివిజన్ కార్పొరేటర్ అడకా పద్మావతి, అంగడి శ్రీనివాసరావు, కుమ్మర కోటేశ్వరరావు, తుమ్మల నాగేశ్వరరావు, సాంబిరెడ్డి, కార్పొరేటర్ కాంద్రకుంట గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలపై ఆర్ఐఓ పర్యవేక్షణా లోపం: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-మంగళగిరి : ఇష్టానుసారంగా సెలవు దినాల్లో కూడా కాలేజీలు నిర్వహిస్తున్న ప్రైవేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని వీజే జూనియర్ కాలేజ్ నిర్వాహకులు గతంలో వినాయక చవితి పండుగ సందర్భంగా అన్నదానం రోజున సెలవు ఇచ్చినందు వలన రెండో శనివారం కళాశాల నిర్వహిస్తున్నామని ఆర్ఐఓ అనుమతి తీసుకు న్నట్లు వీజే జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్ తెలిపారు. ఏఐఎస్ఎఫ్ కన్వీనర్ యార్లగడ్డ శివ గోపి ఆర్ఐఓకి ఫోన్ చేయగా తాను అనుమతి ఇవ్వలేదని చెప్పారన్నారు. మంగళగిరి పరిధిలోని అన్ని కాలేజీలను రెండవ శనివారం అనుమతి లేకపోవడం వల్ల మూసివేయించారన్నారు. కానీ విజే కాలేజ్ కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్‌ని అడుగగా విచక్షణా కోల్పోయి స్టూడెంట్స్ యూనియన్ నాయకుల ఫోను లాక్కుని అసభ్యంగా మాట్లాడుతూ పోలీసులకు కాల్ చేస్తామని బెదిరిస్తూ మీరేం చేస్తారో చేసుకోండి అని దుర్భాషలాడారని విద్యార్థి సంఘ నాయకులు ఆరోపించారు. కళాశాలపై, కళాశాల కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవాలని వీజే జూనియర్ కాలేజీ గేటు ముందు బైఠాయించి ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం మీడియాతో ఏఐఎస్ఎఫ్ స్టూడెంట్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ వీజే జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గుంటూరులోని ఆర్ఐఓ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ మత్తే అభిషేక్, పట్టణ అధ్యక్షుడు ఆళ్ళమూడి హనోక్ బాబు, ఎస్కే రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి వారి గీతాలాపన

విశాలాంధ్ర-తెనాలి : జగ్గడిగుంటపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రగడ కోటయ్య నగర్‌లో వేంచేసి ఉన్న సీతారాముల స్వామివారి మందిరంలో తెనాలి అన్నమయ్య సంకీర్తన బృందం కొండపి వసుంధర వారిచే గీతాలాపన చేయడం జరిగింది. ప్రతి శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు కొండపి వసుంధర ఆధ్వర్యంలో ప్రగడ కోటయ్య నగర్ సీతారామ స్వామివారిదేవస్థానంలో స్థానిక భక్త బృందంచే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అందె రాజేశ్వరి, ఆకురాతి మౌనిక తదితరులు పాల్గొనగా కొండపి శ్రీనివాసరావు, కొండపి దత్తు శర్మ, అందె బాలచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మానసిక వ్యాధులపై అపోహలు వీడాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నేటి సమాజంలో మానసిక వ్యాధులపై ప్రజలకు అనేక అశాస్త్రీయ అపోహలు ఉన్నాయని, వాటిని పూర్తిగా తొలగించేందుకు మానసిక వైద్య నిపుణులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డాక్టర్ జి.వాణి మోహన్ పిలుపునిచ్చారు. గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్లో 'ఇండియన్ సైకియాట్రి సొసైటీ సౌత్ జోన్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవ సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఐవీఎల్ నరసింహారావు సారథ్యం వహించారు. డాక్టర్ జి.వాణి మోహన్ మాట్లాడుతూ ఇతర వైద్య విభాగాలతో పోల్చితే మానసిక వైద్యుల వైద్య విభాగం కష్టతరమైందన్నారు. కేవలం కుటుంబ సభ్యులు చెప్పే లక్షణాలను బట్టి.. బాధితుల మాటలను బట్టి వ్యాధి నిర్ధారణ చేయాల్సి ఉంటుందని, మానసిక వైద్యులు ఎంతో ఓపికగా విని వ్యాధిని నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. నేడు జీన్స్ మార్చలేము గానీ, వ్యక్తుల అసహజ ఆలోచనలను మానసిక వైద్యులు మార్చగలరన్నారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి ప్రక్రియల ద్వారా మనసును అదుపులో ఉంచుకునే విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నేడు పాఠశాలలు, కళాశాల స్థాయిలోనే విద్యార్థినీ, విద్యార్థులకు మానసిక అంశాలపై అవగాహన శిక్షణకు కౌన్సిలర్లు అవసరం ఉందన్నారు. సౌత్ జోన్ అధ్యక్షులు కె.ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మానసిక వైద్య విభాగాల పీజీలు ప్రజలతో మమేకమై మానసిక వ్యాధులను, ప్రజలకు తెలియజేసి తొలి దశలోనే గుర్తించే విధంగా ప్రజా చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ ఐవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ ఈ కాన్ఫరెన్స్‌లో ఏర్పాటు చేసిన ప్రతి అంశం, పరిశోధనా పత్రం వైద్యులందరికీ ఉపయోగపడే విధంగా ఉండేలా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ కార్యదర్శి డాక్టర్ పి లోకేశ్వర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ కాన్ఫరెన్స్ పర్యవేక్షకులు డాక్టర్ విశాల్ ఇంద్ల, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ జి ప్రసాదరావు, డాక్టర్ శ్రీ రమ్య, డాక్టర్ ఐ శరత్‌చంద్ర, డాక్టర్ అభయ మత్కర్, డాక్టర్ సాహుల్ అమీన్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

విజ్ఞాన్స్‌లో న్యూ క్రిమినల్ లా బిల్స్‌పై వర్క్‌షాప్

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'అస్సెసింగ్ ద న్యూ క్రిమినల్ లా బిల్స్ : ఏ క్రిటికల్ అప్రోచ్ టు క్రిమినల్ లా రిఫార్మ్' అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ అనూప్ సురేంద్రనాథ్ విద్యార్థులకు భారతీయ న్యాయ సంహిత, 2023(కొత్త శిక్షా బిల్లు), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, 2023(న్యూ ప్రొసీజర్ బిల్లు), భారతీయ సాక్ష్యా బిల్లు, 2023(న్యూ ఎవిడెన్స్ బిల్లు) ప్రాముఖ్యత గురించి వివరించారు. సమాజాన్ని రూపుమాపడంలో చట్టం కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అది అన్ని సామాజిక సమస్యలను పరిష్కరించదని గుర్తించడం చాలా అవసరమని ఆయన నొక్కిచెప్పారు. పేదరికం, విద్య, సామాజిక అసమానత వంటి సమస్యలను పరిష్కరించడం, నేరాలకు మూల కారణాలపై లోతైన అవగాహన అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

వల్లభనేని ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన

విశాలాంధ్ర-తాడేపల్లి : చంద్రబాబును విడుదల చేయాలని, సరైన వైద్యం అందించాలని కోరుతూ టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం నోటికి నల్లబ్యాడ్జీలు ధరించి కార్యాలయం వద్ద నుంచి తాడేపల్లి ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మా అధినేత చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేసి జైల్లో ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే విడుదల చేయాలని, చంద్రబాబుకు సరైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. హాని తలపెట్టాలని చూస్తే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడి సత్యనారాయణ, కొయ్యగూర మహాలక్ష్మి, కాటాబత్తని నిర్మల, చిన్నపోతుల చిన్న, ఇట్టా భాస్కర్, ఉయ్యాల కోటేశ్వరరావు, అన్నెం కుసుమ, గోలి శౌరి, అద్దంకి మురళి, దానబోయిన సుందరరావు యాదవ్, చాంద్ బాషా, జి.నాగేశ్వరరావు, మండవ గోపాలరావు, పీటర్ పాల్, జి.శ్రీనివాస్, పోటాబత్తని శ్రీనివాస్, కొయ్యగోర మల్లేశ్వరరావు, దర్శి హరికృష్ణ, షేక్ మస్తాన్ వలి, కాటాబత్తిని సాగర్, సింహచలం, షేక్ బాజీ, నాగూర్ వలి, ఇమ్రాన్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరోగ్యంతో ఆటలొద్దు

విశాలాంధ్ర-గుంటూరు : కుట్ర, అరాచకం కలిపితే ఎలా ఉంటుందో జగన్ పాలన అలా ఉంటుందని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. శనివారం అర్బన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. జగన్ అండ్ కో వైసీపీ శాడిస్టులు చంద్రబాబు నాయుడు ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని, అది పులిపైన స్వారీ అని వారికి అర్థం కావటంలేదన్నారు. చంద్రబాబు నాయుడు అంటే భావితరాల భవిష్యత్తుకు వ్యూహకర్తని తెలిపారు. వైసీపీ అనుసరిస్తున్న దురాగతాలతో రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ కోర్టులను తప్పుదారి పట్టిస్తున్న జగన్ పాలనకు చరమగీతం పాడాలన్నారు. ప్రజల నుంచి దోచుకున్న సొమ్మునే తిరిగి తాయిలాల రూపంలో ప్రజలకే ఇస్తుండడం ఇప్పటికే అందరూ తెలుసుకున్నారని వివరించారు. వైసీపీ ఒత్తిడితో అధికారులు చేపట్టిన అప్రజాస్వామిక చర్యలకు వారే బలి అవుతారని హెచ్చరించారు. వైసీపీ అరాచకానికి తోడు అవుతున్న అధికారులు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని అన్నారు. చంద్రబాబు ప్రాణానికి ప్రమాదం ఏర్పడితే జగన్ మూల్యం చెల్లించుకోవల్సివస్తుందని హెచ్చరించారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు : వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నూతనంగా ప్రవేశాలు పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా సాగాయి. కళాశాలలోని రెండవ సంవత్సర విద్యార్థులు ఈ వేడుకల ద్వారా 2023-2027 విద్యార్థులకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, గీతాలు అలరించాయి. ఇంజనీరింగ్ చదువు మాత్రమే కాదు గొప్ప అనుభూతి అంటూ రూపొందించిన నాటకం ఆకట్టుకుంది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ వీవీఐటీ కళాశాల ఉత్తమమైన చదువు ఉపాధితో పాటు మధురస్మృతులను అందిస్తుందని అన్నారు. క్రమశిక్షణ, విలువలతో విద్యార్థులను ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు వీవీఐటీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లిఖార్జున రెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరోగ్యంపై నిజాలు దాస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆరోగ్యం విషయంపై నిజాలు దాచి, ఆయన ప్రాణాలకు హాని కల్గించేందుకు కుట్ర చేస్తుందని, దీనికి రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి వైద్యుల నివేదికే నిదర్శనమని కోవెలమూడి రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. కోవెలమూడి రవీంద్ర ఆధ్వర్యంలో 22 డివిజన్ అధ్యక్షులు షేక్ నాగూర్ వలి నేతృత్వంలో శ్రీనివాసరావుపేటలోని పీర్ల చావిడి సెంటర్‌లో చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాల పంపిణీ, బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందేలా ఆదేశాలు ఇవ్వాలని గవర్నర్‌ను కోరారు. డివిజన్ అధ్య క్షుడు షేక్ నాగూ ర్, క్లస్టర్ చింతకాయల రామారావు, పరిశీలకుడు సింహాద్రి కనకాచారి, జిలాని, కరీం, గౌస్, నైజాంబాబు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింట్ అయిన గుంటూరుజిల్లా, చుండూరు(మం॥గ్రామం)లోని అంబేద్కర్ నగర్ గ్రామ కాపురస్తుడయిన తప్పెట శామ్యూల్ గారి కుమారుడు ఇస్సాక్ గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా, నాక్లయింటు తప్పెట ఇస్సాక్ ఈక్రింది ఉదహరించిన షెడ్యూలు దాఖలా ఆస్తిని, తానాచింతల చిన్న ఇస్సాక్ గారి భార్య రత్నకుమారి గారి వల్ల క్రయము పొంది ది.05-02-2001 తేదిన తన పేరున విక్రయ స్వాధీన అగ్రిమెంటు పొంది నాటి నుండి నేటి వరకు నాక్లయింటు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని తన స్వాధీనంలో ఉంచుకొని తన పేరున తాకీలు, శిస్తులు కట్టుచూ యదేఛ్చగా ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని అనుభవించుచున్నాడు. కనుక నాక్లయింటు అయిన తప్పెట ఇస్సాక్ గారు ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి హక్కుదారులై ఉన్నారు. నా క్లయింటుకు తెలియకుండా ఎవరైనా ఈ షెడ్యూలు ఆస్తిపై లావాదేవీలు గానీ, అన్యాక్రాంతములు కానీ జరుపరాదు. అట్లు చేసిన ఎడల నాక్లయింటు వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొనెదరు.

షెడ్యూలు: గుంటూరు డి॥ తెనాలి సబ్.డి॥ బుడంపాడు గ్రామ పంచాయితీలోని బుడంపాడు గ్రామ డి.నెం.407/5లో య.0-51 సెంట్లు భూమికి **హద్దులు.తూర్పు:** అంగలకుదురు యోసోబు భూమి, **దక్షిణం:** బత్తుల బాబురావు, **పడమర:** కారుమంచు సుందరమ్మ. **ఉత్తరం:** సర్కారు డొంక. ఈ హద్దుల మధ్య య.0-51 సెంట్లు సరియగు 0.206 హెక్టార్ల భూమి.

కేసానుపల్లి వెంకట శ్రీరామ్ సుబ్బారావు, అడ్వకేట్
6/4 అరండల్‌పేట, గుంటూరు, సెల్: 9849187315

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

నేటి నుంచి దసరా మహోత్సవాలు

విశాలాంధ్ర-పెదకూరపాడు : నియోజవర్గ పరిధిలోని అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ, అచ్చంపేట, పెదకూరపాడు మండలాలలో దేవిశరన్నవరాత్రులు 75 త్యాళ్లూరులో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణాంబికా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 15వ తేది నుంచి 23వ తేది వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ శివసాయి సేవాసమితి ట్రస్ట్ సభ్యులు తెలిపారు. రోజుకో అలంకారం చొప్పున జరుగుతుందని, ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుంచి శ్రీలలిత సహస్రనామములతో సామూహిక కుంకుమార్చన పూజలు జరుగుతాయని తెలిపారు. భక్తులందరూ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొని అమ్మకృపకు పాత్రులు కావాలని కోరారు.

చంద్రబాబు ఆరోగ్యంపై నిర్లక్ష్యం బాధాకరం

విశాలాంధ్ర-పెదకూరపాడు : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య వైఖరి వ్యవహరిస్తున్నారని, ఆయనకు తక్షణమే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి ఆధునాతన వైద్యం అందించాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ ఒక ప్రకటనలో అన్నారు. క్రమశిక్షణతో కూడిన ఆహారపు అలవాట్లు కలిగిన చంద్రబాబు ఆరోగ్యం దెబ్బకొట్టి ప్రజా క్షేత్రంలో రానివ్వకుండా ఉండేందుక జగన్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అన్యాయంగా అరెస్టు చేయటమే కాకుండా సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. నెల రోజులలో ఐదు కేజీలు బరువు తగ్గటం ఆందోళన కలిగిస్తుందన్నారు. స్కిన్ ఎలర్జీ కారణంగా చంద్రబాబు ఎక్కువసేపు వేడి వాతావరణం తట్టుకోలేరని, ఆ విషయాన్ని అధికారులు దృష్టికి మొదట్లో తీసుకువెళ్లిన నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రజలు గమనిస్తున్నారని రాబోయే ఎన్నికలలో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

గోవింద-గోపాల శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : గోవింద-గోపాల శిక్షణా తరగతులు సత్యసాయి ధ్యాన మందిరంలో గోవు అండ్ గీతా పరిశోధన ప్రచార ఆశ్రమం, ప్రొద్దుటూరు ఆశ్రమాధిపతి స్వామి శ్రీహరికృష్ణ ఆధ్వర్యంలో జరుగుతాయని నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ నెల 13న పంచగవ్య చికిత్స ద్వారా సకలవ్యాధులను నయంచేసుకోవచ్చని, గోమాతసేవ, గోమాతరక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చని హరికృష్ణ వివరించారు. విశ్రాంత ఉపాధ్యాయులు జిగురు ప్రతాపసింహ శాస్త్రి మాట్లాడుతూ గోవుకదిలే వైద్యశాలని, గో ఉత్పత్తుల ద్వారా కేన్సర్, పక్షవాతం, కీళ్లనొప్పులు, థైరాయిడ్ వంటి దీర్ఘకాలవ్యాధులకు ఎటువంటి దుష్ఫలితాలులేని చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల గోసేవకులు దామోదర శ్రీనివాస్, వాసవి గోశాల కమిటీ సభ్యులు దేవరశెట్టి రవికుమార్, నాగరాజు, మోటమర్రి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో నేటి నుంచి దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : పట్టణంలోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో ఆదివారం కలశస్తనతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆశ్రమ ధర్మకర్త మఠాధిపతులు లలితాంబ మాతాజీ శనివారం తెలిపారు. మొదటి రోజు స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అమ్మవారు దర్శనం ఇస్తారన్నరు. ప్రతిరోజూ కుమారి సుహాసిని పూజలు కుంకుమార్చన ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఆశ్రమ నిర్మాణ వ్యవస్థాపక ధర్మకర్త మఠాధిపతులు పూజ్య గురువులు స్వప్రకాష్ గురూజీ జన్మదినం, దుర్గాష్టమి సందర్భంగా 22 ఆదివారం అన్నప్రసాద వితరణ జపరనున్నట్లు మాతాజీ తెలిపారు. ప్రతిరోజూ భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా విజయవాడ నుంచి ప్రత్యేకంగా ఆరు అడుగుల అమ్మవారి విగ్రహాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

విశాలాంధ్ర-దుర్గి : పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. మండల పరిధిలోని అమ్మవారి ఆలయం వెనుక మామిడి తోపులో పేకాట ఆడుతున్న సమాచారం అందుకున్న ఎస్సై ఎం.శివ తమ సిబ్బందితో ఆ స్థావరంపై దాడులు నిర్వహించారు. దాడుల్లో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.32,060ల నగదు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వారిని సొంత పూచీకత్తుపై ఇంటికి పంపించారు. మాచర్ల మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులు

విశాలాంధ్ర-మాచర్ల : దసరా పండుగను పురస్కరించుకొని మాచర్ల నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్ సర్వీస్‌లను నడపనున్నట్టు డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య తెలిపారు. శనివారం డీఎం పిచ్చయ్య మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి హైదరాబాద్‌కు 12 ప్రత్యేక బస్సులను కేటాయించామన్నారు. ఏటా మాదిరిగానే ప్రయాణికులకు అదనపు భారం లేకుండా ఈ సంవత్సరం కూడా సాధారణ టిక్కెట్టు ధరతో బస్సులను నడపనున్నట్టు ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రయాణికులు ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీని కల్పించినట్టు ఆయన తెలిపారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా విజయపురిసౌత్‌లోని మెయిన్ బజార్, సి టైప్‌లోని ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలను నెలకొల్పి మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి శరన్నవరాత్రి ఉత్సవాలకు అమ్మవారి విగ్రహాలను ఆయా మండపాలకు భక్తులు తరలించారు. నేటి నుంచి దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో జరుపనున్నారు. నవరాత్రులలో ప్రతి రోజు ఒక్కొక్క అలంకరణతో అమ్మవారికి పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు సౌకర్యార్థం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను సిద్ధం చేశారు.

పేదలకు దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలో ఆజాద్ నగర్ ఎస్టీ యానాది కాలనీ నందు పట్టణానికి చెందిన క్రీస్తు రక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిరుపేదలైన వారికి బట్టల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆజాద్ నగర్ ఎస్టీ యానాది కాలనీ నిరుపేదలు సుమారు 100 మంది పెద్దలు పిల్లలు ఉన్నారని తెలుసుకొని క్రీస్తు రక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు జంగా కృష్ణ మాట్లాడుతూ యేసు క్రీస్తు చేపట్టినట్లుగా నన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు అనే మంచి ఉద్దేశంతో గత పది సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు ఫౌండేషన్ ద్వారా చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జంగా పరుశురాం, దాసరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యాపీఠం సందర్శించిన పరిశీలకులు

విశాలాంధ్ర-నరసరావుపేట : మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో సార్వత్రిక పీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న పర్సనల్ కాంటాక్ట్ తరగతులను శనివారం సార్వత్రిక పీఠం రాష్ట్ర పరిశీలకులు అక్బర్ అలీ తనిఖీ చేశారు. ఇక్కడ జరుగుతున్న శిక్షణా తరగతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. హాజరైన అభ్యాసకులకు సెలవు దినాలలో జరుగు తరగతులకు హాజరై ఇక్కడ అధ్యాపకులు ఇచ్చే సూచనలు పాటిస్తూ తమ విద్యను కొనసాగించాలని బంగారు బావి జీవితము బాగు కోసం ప్రతి అభ్యాసకుడు కచ్చితంగా తరగతులకు హాజరుకావాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా సమన్వయ కర్త కేఎంపీ హుస్సేన్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి అభ్యాసకులకు కరదీపికలు, ఉత్తీర్ణత సర్టిఫికేట్లు వారు ఇచ్చిన అడ్రస్‌కు తపాలా శాఖ ద్వారా నేరుగా వారి ఇంటికే పంపడం జరుగుతుందని తెలిపారు. గృహిణీలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజా బ్యాలెట్

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని శివయ్య స్తూపం వద్ద శనివారం వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ప్రజా బ్యాలెట్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ టు యు పట్టణ కార్యదర్శి ఎస్.కే. ఫిరోజ్ అధ్యక్షత వహించి కార్యక్ర మాన్ని ప్రారంభించగా, అఖిలభారత కిసాన్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు తోట ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలను ప్రజల పైన కోట్లాది రూపాయలు భారం పెంచి కార్పొరేట్ సంస్థలకు ప్రజా సంపదని ముట్ట చెబుతున్నారని, విద్యుత్తుని కార్పొ రేట్ సంస్థలకి అప్ప చెప్పిన తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ 8 సార్లు విద్యుత్ చార్జీలని పెంచిందని, ఇందనపు సర్దుబాటు చార్జీల పేరుతో కోట్ల రూపాయలు ప్రజల సొమ్మును లూటీ చేస్తున్నారని అన్నారు. స్మార్ట్ మీటర్ల పేర్లతోటి కోట్ల రూపాయలు అంబానీ, అదాని లకు కట్టబెడుతూ రైతులకు ఇస్తున్న వ్యవసాయ విద్యుత్తుని ప్రవేట్‌లో భాగంగానే సబ్సిడీ తీసేయడానికి అనేక ప్రయోగాలు చేస్తుందని, బొగ్గు కొనుగోలు పేరుతోటి అదనపు చార్జీలు వేయటం రాష్ట్ర ప్రభుత్వం దివాలా కోరు విధానానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం విధానాలను మక్కీగా ఇక్కడ అమలు చేస్తుందని దీనివలన ప్రజలకు అన్ని రకాలుగా బస్సు చార్జీల దగ్గర నుంచి విద్యుత్, నిత్య వసరవస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పోయాయని, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న వామపక్ష పార్టీ కార్యకర్త లపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, రాబోయే కాలం లో కేంద్రంలో బిజెపిని, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని అప్పుడే అన్నీ వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, భవిష్యత్తులో వామపక్ష పార్టీలు, ప్రతిపక్ష పార్టీలు కరెంట్ చార్జీలపై చేసే పోరా టంలో ప్రజల పాల్గొనాలని బూదాల పిలుపునిచ్చారు. జనసేన వినుకొండ నియోజకవర్గం అధికార ప్రతినిధి పొరెళ్ల అభిమన్య మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు ఇప్పటికే 8సార్లు పెంచి ఇంకా అదనపు భారా లని వినియోగదారులపై బనాయించటం సరైన పద్ధతి కాదని ప్రజా వ్యతిరేక విధానాల్ని అవలంబిస్తున్న వైసిపి పార్టీని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని, పవన్ కళ్యాణ్ ప్రతిపక్ష పార్టీల ఓట్లు చీలకూడదని ఐక్య కార్యాచరణ పేరుతో అన్ని రాజకీయ పార్టీలు కలిసి వైసీపీని ఓడిం చడం కోసం అందరం కలిసి పోరాటం చేయాలని అన్నారు. జనసేన నాయకులు నాగ శ్రీను మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలని ఎప్పటికప్పుడు ప్రజలకు అర్థమయ్యే విధంగా చైతన్యవంతులు చేస్తూ నిరంతరం ప్రజా పోరాటాలు చేస్తున్న వామపక్ష పార్టీలకు మా వంతు సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని అన్నారు. పట్టణ ఎంఐఎం పార్టీ అధ్యక్షులు ఎస్ కే బాజీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆర్కే నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాభిప్రాయాన్ని కోరటం చాలా మంచి పరిణామం అని ఈ అభిప్రాయాన్ని ఉద్యమ రూపంలో తీసుకురావాలని దీనికి మా సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు కె.శ్రీనివాసరావు, సంఘం దుర్గాప్రసాద్, భాస్కరు, సంఘం నాయకులు ఓబులాపురం ఆంజనేయులు, మిద్దెపై వెంకటేశ్వర్లు, సిపిఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, వామపక్ష పార్టీల ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదేళ్ల పాలనలో జీవీ ఏం చేశారో చూపెట్టాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వినుకొండ: పదేళ్లు ఎమ్మెల్యేగా పాలన చేసిన జీవి ఆంజనేయులు ప్రజలకు గుర్తుండే విధంగా ఒక్క అభివృద్ధి పనైనా చేశారా చేస్తే. అది చూపెట్టాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సవాల్ విసిరారు. శనివారం వైసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జీవీ ఆంజనేయులు శివశక్తి ఫౌండేషన్ పేరుతో తూతూ మంత్రంగా పలు కార్యక్రమాలు చేస్తూ అరకొర అన్నదానాలతో పది సంవత్సరాలు కాలం గడిపాడని అన్నారు. విదేశాలలో ఉన్న మన తెలుగు ప్రజల ముందు వినుకొండను అవమానపరచారన్నారు. ఎన్నికల సమయంలోనే శివశక్తి ఫౌండేషన్ పేరుతో ప్రజల ముందుకు వచ్చి జీవీ ఆంజనేయులు జిమ్మిక్కులు చేస్తుంటాడని, ఆయన శివశక్తి ఫౌండేషన్ బ్యాలెన్స్ షీటు ఎప్పుడన్నా వివరించాడా అని బొల్లా ప్రశ్నించారు. అలాగే శివ శక్తి బయోటెక్ ఫెర్టిలైజర్స్, వర్మీ కంపోస్ట్ పేరుతో పలు వ్యాపారాలు చేస్తూ, పలు రాష్ట్రాల ప్రజలను మోసం చేసి రైతులతో కేసులు పెట్టించుకున్న సంగతి ప్రజలంద రికీ తెలుసునని ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అన్నారు. కల్తీ ఎరువులతో రైతులను మోసం చేసి కోట్ల రూపాయలు గడిస్తూ శివశక్తి ఫౌండేషన్ సేవలు అంటూ పదిమంది విద్యార్థులకు స్కాలర్షిప్లు అందజేసి తద్వారా విదేశాల నుంచి రాయితీలు తెప్పించుకున్న సంగతి అందరికీ తెలుసునన్నారు. ఇప్పటికైనా జీవి ఆంజనేయులు నాలుగేళ్లుగా వినుకొండలో జరిగిన అభివృద్ధి పనులను చూసి. అభివృద్ధికి ఆటంకాలు కలిగించకుండా సహకరించాలని ఎమ్మెల్యే హితవు పలికారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాలుగేళ్లలో వినుకొండలో పలు అభివృద్ధి పనులు చేశానని ప్రధాన సమస్యగా ఉన్న త్రాగునీటి సమస్యను అధికమించి ప్రజలకు సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే ఎన్ఎస్పి కాలువ ఇరువైపులా సిమెంట్ రోడ్లు వేసి లైటింగ్ ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన మొక్కలను వేయడం జరిగిందని. ఈ రోడ్ల వల్ల ప్రజల రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉందన్నారు. అలాగే వినుకొండ పైకి ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. ఇక గతంలో బందెల దొడ్డిగా ఉన్న వినుకొండ 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఎంతో ఆధునికరించామని, ఆధునిక పరికరాలతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న కారణంగా ఆసుపత్రికి మూడు నేషనల్ అవార్డులు వచ్చాయన్నారు. ఇక ఎన్ఎస్పిలో ఆరు ఎకరాల భూమిలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు నాబార్డు నిధులతో ఈ వంద పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందన్నారు. అలాగే ఫస్ట్ వార్డు బాలికల పాఠశాల నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయన్నారు. అయితే కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులకు.. సురేష్ మహల్ రోడ్ విస్తీర్ణం పనులకు కొందరు కోర్టుకు వెళ్లి ఆటంకాలు కలిగించారని దీన్ని ప్రజలు గమనించారని త్వరలో ఆ సమస్యలను అధిగమిస్తామని ఎమ్మెల్యే బొల్లా అన్నారు. ఈ సమావేశంలో జెడ్.పి.టి.సి స్వేనొం, నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలను దగా చేసిన జగన్

విశాలాంధ్ర-పెదకూరపాడు : అన్ని వర్గాల ప్రజలను దగా చేయడంలో వైసీపీ ప్రభుత్వాన్ని మించిన ప్రభుత్వం మరొకటి లేదని ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని బలుసుపాడు గ్రామంలో శనివారం జనసేన మేనిఫెస్టోను గ్రామంలో తిరిగి ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి అన్ని వర్గాల ప్రజలు గత ఎన్నికల్లో అండగా నిలిచాయన్నారు. ఎప్పుడైతే ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారో అప్పటినుంచి అన్ని వర్గాల ప్రజలకు కష్టాలు ప్రారంభమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డు స్థాయిలో మెజార్టీ ఇచ్చిన కృతజ్ఞత కూడా లేకుండా ముఖ్యంగా దళితుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సుమారు 27 పథకాలు తీసేశాడని, దళితులను చంపి డోర్ డెలివరీ చేయటం, శిరోమండన చేయడం, ప్రశించిన దళితులపై పిచ్చివాడి ముద్ర వేసి నరకయాతనకు గురి చేయటం వంటి ఎన్నో దారుణాలకు వైసీపీ ప్రభుత్వం పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలు, ముస్లిం మైనార్టీలను కూడా దగా చేశారని దుయ్యబట్టారు. చలపతిరావు, శౌరిలు, శివకోటేశ్వరరావు, హనుమంతరావు, గంగారావు, శీపతి శీనువాసరావు, ఎర్రంశెట్టి రామకృష్ణ, వాకా అఖిల్, మట్ట వీర భద్రరావు, రమాదేవి, శాఖమూరి శ్రీనివాసరావు, బిల్లూరి సురేష్ పాల్గొన్నారు.

బాలికలలో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర-శావల్యాపురం : బాలికలలో రక్తహీనతను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వైద్యాధికారి వేమూరి వెంకట బాస్కర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో 10 నుంచి 18 ఏళ్ళలోపు బాలికలలో 963 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన బంగారుతల్లి కార్యక్రమం ద్వారా బాలికలలో రక్తహీనతను గుర్తించేందుకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేయడం జరిగిందని, బాలికలకు ప్రతినెల రక్తశాతాన్ని గుర్తించి ప్రోగ్రెస్ కార్డులలో నమోదు చేయడం ద్వారా వ్యత్యాసాన్ని గుర్తించి రక్తం తగ్గినట్లయితే సకాలంలో వారికి వైద్యచికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. రక్తహీనత కలిగిన బాలికలకు, వారి తల్లిదండ్రులకు వైద్యసిబ్బంది ద్వారా తగిన సలహాలు, సూచనలు అందించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు.

నాటుసారా విక్రేతలకు కౌన్సిలింగ్

విశాలాంధ్ర-దుర్గి : నాటుసారా విక్రయాలను నిలిపివేయాలని ఎస్సై శివ హెచ్చరించారు. గతంలో నాటుసారా విక్రేతలను గుర్తించి స్టేషన్‌కు పిలిపించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిషేధిత వ్యాపారం మానుకోవాలని, పోలీసుల రికార్డుల్లో ఎక్కవద్దని, పద్ధతి మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి : కాసా రాంబాబు

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను, ఇతర పన్నులను వెంటనే ఉపసంహరించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ప్రదర్శన చేపట్టి విద్యుత్ ఛార్జీలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోయలేని విద్యుత్ ఛార్జీలను మోపుతున్నారని, ఏ నెలకు ఆ నెల ట్రూ అప్ చార్జీల పేరుతో వినియోగదారు వాడిన విద్యుత్ చార్జీల కన్నా ట్రూ ఆఫ్ చార్జీలను అధికంగా వసూలు చేస్తున్నారని అన్నారు. ఇంటి పన్నులను రెట్టింపు చేశారని, చెత్త పన్ను వసూలు చేస్తున్నారని, ఆర్టీసీ చార్జీలను పెంచారని, నిత్యవసర సరుకుల ధరలు పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవించే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, ప్రజానాట్యమండలి కార్యదర్శి షేక్ చిన్న జాను సైదా, బ్రహ్మయ్య, జక్రం, డేవిడ్, బ్రహ్మయ్య, నరసింహారావు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీపాట్స్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-నరసరావుపేట: వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాములో భద్రపరచిన ఎలక్షన్ సామాగ్రిని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. 2024 ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్నికల అధికారులు ఎన్నికల సామాగ్రిని సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గోడౌన్ నిర్వహణ అధికారి జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్ప శ్రీ, డిఆర్‌ఓ వినాయకం, ప్రోటోకాల్ సిబ్బంది, ఎన్నికల నిర్వహణ అధికారులు పాల్గొన్నారు. ఈవీఎం, వివి ప్యాట్లు అన్ని సక్రమంగా సరిపడా ఉన్నాయా లేదా గమనించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

చంద్రబాబు విడుదల కావాలని పూజలు

విశాలాంధ్ర-నరసరావుపేట: టీడీపీ అధినేత చంద్రబాబు విడుదల కావాలని, ఆయన ఆరోగ్యం బాగుండాలని కోరుకుంటూ రాష్ట్ర డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇస్సపాలెం శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఆరోగ్యం క్షీణించి బరువు తగ్గటం, డీహైడ్రేషన్‌కు గురవటం, చర్మవ్యాధులు రావడం లాంటివి జరుగుతా ఉంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని తక్షణమే చంద్రబాబు నాయుడుని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రిఫర్ చేయాలని కోరారు. టీడిపి ఇంచార్జీ ఇంచార్జ్ డాక్టర్ అరవింద్ బాబు, యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, సీనియర్ నాయకులు వేములపల్లి వెంకట నరసయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు కడియాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నూర్ బాషా, దూదేకుల ముస్లింలకు చట్టసభల్లో స్థానం కల్పించాలి

విశాలాంధ్ర-శావల్యాపురం : నూర్ భాషా, దూదేకుల ముస్లింలకు చట్టసభల్లో స్థానం కల్పించాలని దూదేకుల సంఘ రాష్ట్ర మీడియా కన్వీనర్ ధర్మవరపు నాగూర్ వలి డిమాండ్ చేశారు. మండలంలోని కారుమంచి గ్రామంలో నూర్ భాషా, దూదేకుల ముస్లింల సింహగర్జనకు ఛలో గుంటూరు గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగూర్ వలి మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీన గుంటూరులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో జరగనున్న నూర్ భాషా, దూదేకుల ముస్లింల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు దూదేకులను అధికారంలో భాగస్వామ్యులను చేయాలని, మైనార్టీ పదవుల్లో వర్గీకరణ, నూర్ భాషా దూదేకులకు ప్రత్యేకంగా పదవులు, బడ్జెట్ కేటాయించాలని కోరడమే ఈ సభ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఏ పార్టీ అయితే మాకు చట్టసభల్లో అవకాశం కల్పిస్తుందో ఆ పార్టీకి సంపూర్ణ మద్దతు పలుకుతామని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కారుమంచి నూర్ భాషా సంఘం అధ్యక్షునిగా కొచ్చర్ల కమాల్‌ను, ప్రధాన కార్యదర్శిగా ధర్మవరపు అంజయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతకోట నాగూర్ వలి, దర్యా, మదార్ తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'జైలులో చంద్రబాబుకు ప్రాణహాని ఉంది'

విశాలాంధ్ర-కారంపూడి : రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రాణహాని ఉందని, ఆయనకు ఎదైనా జరిగితే పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాల్సి ఉంటుందని మండల టీడీపీ నాయకులు అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై వివిధ కథనాలు మీడియాలో వస్తున్నాయని, ఆరోగ్యం గురించి తమకు ఆందోళనగా ఉందని వారు అన్నారు. జైలులో చంద్రబాబుకు భద్రత లేదని వారు ఆందోళన వ్యక్తంచేశారు. జైళ్ల శాఖ డీఐజీ డ్రోన్ కెమెరా జైల్ పరిసరాల్లో తిరిగిన మాట వాస్తవమేనని విలేఖరుల సమావేశంలో చెప్పడం దానికి కారణం ఏమిటో తెలియదని అనడం ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏ విధంగా ఉన్నాయో చెప్పడానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న చంద్రబాబుకే రక్షణ కరువైందని అన్నారు. చంద్రబాబుకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, ఆయన వయసును గౌరవించైనా ఆయనకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వారు కోరారు. చంద్రబాబుకు ఏదైనా జరిగితే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పంగులూరు అంజయ్య, మండల టీడీపీ అధ్యక్షులు ఉన్నం లక్ష్మీనారాయణ, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, పట్టణ అధ్యక్షులు కటికల బాలకృష్ణ, చప్పిడి రాము, తండా మస్తాన్ జాని, బాలూ నాయక్, నాగేశ్వరరావు, బోల్నేడి హరి, బాపనయ్య, గమిడి పూర్ణయ్య పాల్గొన్నారు.

కంటి పరికరాలకు కలెక్టర్ హామీ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు కంటి ఆపరేషన్‌కు సంబంధించి పరికరాలు నివేదికను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కంపెనీ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ క్రింద వెంటనే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఏరియా హాస్పిటల్ ఎంతో అభివృద్ధి చెందిందని ముఖ్యంగా ఇటీవల ఆధునీకరించిన చిన్నపిల్లల వార్డు, గర్భిణీ స్త్రీల కోసం ఏర్పాటు చేస్తున్న ఆపరేషన్ థియేటర్ ఒక కార్పొరేట్ హాస్పిటల్స్ స్థాయిని అందుకుంటుందని దానికి కావాల్సిన సహకారాలు అన్నిటిని నేను అందిస్తానని తెలియజేశారు. హాస్పటల్ అభివృద్ధి కమిటీ కూడా ఎంతో చురుగ్గా సేవాభావంతో పనిచేస్తుందని హాస్పిటల్ దినదినాభివృద్ధి చెందుతుందని కొనియాడారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ పల్నాడు డీసీహెచ్ రంగారావు సహకారంతో హాస్పిటల్ ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవతో హాస్పిటల్‌ను పల్నాడు జిల్లాలోని మొదటి హాస్పిటల్‌గా నిలిచిందని అన్నారు.

సాగర్ కుడి కాలువకు నీరివ్వాలి

విశాలాంధ్ర-పెదకూర పాడు : ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో సాగర్ కుడికాలువ నుంచి ఇంత వరకు సాగునీరు విడుదల చేయలేదని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. నీరు లేక లక్షల ఎకరాల్లో మాగాణి భూమి బీడుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో మిర్చి సుమారు 25 వేల ఎకరాలలో వేశారని, మిర్చి మొక్క ఒకటి రూ.2లు చొప్పున కొనుగోలు చేసి ఎకరానికి ఇప్పటికే సుమారు రూ.40 వేలు ఖర్చు చేశారని, అయితే నీరు లేక పంట ఎండిపోతుందని అన్నారు. కౌలు చెల్లించిన రైతులు కూడా పూర్తిగా నష్టపోతున్నారని చెప్పారు. రైతులు బావుల ద్వారా వాగుల ద్వారా సుమారు మూడు వేల నుంచి నాలుగు వేల అడుగుల వరకు పైపుల ద్వారా ఇంజన్లతో మిర్చికి నీరు పెడుతున్నారన్నారు. కుడికాలువ తూటాకు నిండిపోయి కాలువలో నీరు ప్రవహించే పరిస్థితి లేదని, కనీసం పశువులు తాగటానికి నీరు లేక ఇబ్బందిపడుతున్నాయని చెప్పారు. రైతు పక్షపాతి అని చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం పంట ఎండిపోతున్నా నీరు విడుదల చేయడం లేదని అన్నారు. పంట పూర్తిగా ఎండిపోయి రైతు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కుడి కాలువకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పోస్టల్ శాఖలో ఉద్యోగాల పేరుతో మోసం

విశాలాంధ్ర-అమరావతి : రిలయన్స్ మార్ట్ పక్కన పాగళ్ల వంశీకృష్ణ ప్రగతి నగర్ పాత గుంటూరు, చొప్పవరపు జగదీష్ సత్తెనపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు కలిసి ఒక రేకుల షెడ్డును అద్దెకు తీసుకొని అందులో పోస్టల్ డిపార్ట్మెంట్‌కు చెందిన జీడీఎస్(గ్రామీణ్ డాక్ సేవక్) ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి అమాయకులైన నిరుద్యోగులను మభ్యపెట్టి ఒక్కొక్కరి వద్ద నుంచి సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు తీసుకొని వారికి ఫేక్ అపాయింట్మెంట్ ఆర్డర్స్ ఇచ్చి, ఆ అపాయింట్మెంట్ ఆర్డర్స్ పైన పోస్టల్ డిపార్ట్మెంట్‌కి సంబంధించిన స్టాంపులను, లోగోలను ముద్రించి వాటిపై సంతకాలు చేసి ఇస్తున్నారు. అదేవిధంగా అలా కట్టిన వారికి ట్రైనింగ్ ఇస్తున్నట్లు వారిచే ఆఫీస్ పనులు చేయించుకుంటూ వారికి పోస్టల్ డిపార్ట్మెంట్‌కు సంబంధించిన ఐడి కార్డులు ఇచ్చి వారిని మభ్యపెడుతున్నారు. ఈ విధంగా ఇప్పటికి సుమారు 40 మంది అమాయకులైన నిరుద్యోగులను మోసం చేసి వారికి పోస్టల్ డిపార్ట్మెంట్లో జాబ్స్ ఇప్పిస్తామని వారి వద్ద నుంచి నగదును తీసుకున్నట్లు సమాచారము. ఈ విషయంపై ఆర్.రాధాకృష్ణమూర్తి అసిస్టెంట్ సూపరిండెంట్ పోస్ట్స్ మంగళగిరి సబ్ డివిజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాగళ్ల వంశీకృష్ణ, చొప్పవరపు జగదీష్‌లపై అమరావతి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగింది. ఎవరైనా పై ఇరువురి చేతిలో మోసపోయి పోస్టల్ ఉద్యోగాల నిమిత్తం నగదును చెల్లించినట్లయితే వెంటనే అమరావతి పోలీస్ వారికి 9440796217 నెంబర్‌లో సమాచారం తెలపవలసిందిగా కోరారు.

ఆయుష్మాన్ భవ ఆయుష్ వైద్య శిబిరం

విశాలాంధ్ర-నూజెండ్ల : ములకలూరులో ఆయుష్మాన్ భవ కార్యక్రమం డాక్టర్ ఆర్.శ్రీనివాస్ ఆయుష్ వైద్యాధికారి ఆధ్వర్యంలో శనివారం ఆయుష్ ఆరోగ్య మేళ కమిషనర్ ఎంటీ కుమార్, ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ పద్మజాతి ఆదేశానుసారము గ్రామంలో నిర్వహించి సుమారు 54 మందికి బీపీ పరీక్షలు, ఆరోగ్యంపై అవగాహన కలిగించి యోగా శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులకు, వాత వ్యాధులకు, రక్త చాపముకు, మధుమేహంకు, ఆమ్లపితం వ్యాధికి ఆయుష్ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మహాలక్ష్మి, ఆశా కార్యకర్త మరియమ్మ, యోగా టీచర్ వెంకటాచారి, ఆయుష్ సిబ్బంది గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాబు అక్రమ అరెస్టుపై వినూత్న నిరసన

విశాలాంధ్ర-వినుకొండ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అక్రమ అరెస్టును ఖండిస్తూ పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ఆదేశాల మేరకు శనివారం శివయ్య స్తూపం సెంటర్ దగ్గర , ఎంపిడిఓ కార్యాలయం వద్ద మహాత్మ గాంధీజీ విగ్రహం ఎదుట మోకాళ్ళ పై నించొని, చేతులుకి సంకెళ్లు వేసుకొని నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కూరపాటి హనుమంతరావు, నియోజవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నర్రా కిషోర్, పార్లమెంట్ అధికార ప్రతినిధి వీరగంధం ప్రశాంత్, పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు కరీం, టౌన్ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ఎస్. కె కాజా, నియోజవర్గ టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు ఫణి దీపు వెంకట సాయి, నియోజవర్గ కార్యదర్శి కాకాని బ్రహ్మనాయుడు, అది అధికార ప్రతినిధి వక్కలగడ్డ నాగార్జున, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No.353/2023 in
H.M.O.P.No.58/2022

Between:

కొఠారి శ్రీలత ...పిటీషనర్/రెస్పాండెంట్

V/s

కొఠారి సురేష్ ... రెస్పాండెంట్ /పిటీషనర్

పై నంబరు పిటీషన్‌ను పిటీషనర్ రెస్పాండెంట్ పై దాఖలు చేయగా సదరు పిటీషన్ నందు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను సదరు రెస్పాండెంట్ గ్రామంలోనే ఉండి నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, ది.30-10-2023నకు వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజున రెస్పాండెంట్ స్వయంగా కానీ లేక వకీలు. ద్వారా కానీ వచ్చి శ్రీ కోర్టు వారి ఎదుట హాజరుకాగలరు. లేనిచో రెస్పాండెంట్ పరోక్షంగా తీర్మానించెదరు.

వాయిదా : 30-10-2023

బి.నాగిరెడ్డి, డి.కిరణ్ దాస్,
పిటీషనర్/రెస్పాండెంట్ తరపు న్యాయవాదులు,
గురజాల

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు గురజాల

IA.1207/2019, O.S NO : 29/19

STATE BANK OF INDIA MACHERLA BRANCH BY IT's BM ... వాది

మరియు

షేక్ చిన్న మస్తాన్ (డైడ్) .... ప్రతివాది

To, షేక్ అల్లమ్మ భర్త షేక్ చిన్న మస్తాన్, వయస్సు 67 సంవత్సరములు, R/O శ్రీరామపురం తండా, వెల్దుర్తి మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది చనిపోయినందున మీరు ప్రతివాదికి భార్య అయి ఉన్నందున మిమ్ములను పై దావాలో వారసులుగా చేర్చుటకొరకు వాది పై నెంబరు వారసుల పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. పై నెంబరు పిటిషన్‌లో మీకు గల అభ్యంతరములను తెలియజేయుటకు మీరు స్వయంగా గాని లేదా శ్రీ కోర్టు వారి అన్ని ప్రశ్నలకు బదులు ఇవ్వగల న్యాయవాది ద్వారా గాని ది. 31-10-2023వ తేదీన ఉదయం 10:30 గంటలకు, పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేనియెడల పై నెంబరు పిటిషన్ ను మీ పరోక్షమున తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.

వాయిదా తేది. 31-10-2023

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గంద్రకోట శ్రీనివాసరావు
వాది తరఫున న్యాయవాది

చంద్రబాబు క్షేమంగా ఉండాలని ప్రార్థనలు

విశాలాంధ్ర-అద్దంకి : చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై టిడిపి శ్రేణులతో పాటు సామాన్య ప్రజల్లో కలవరం నెలకొంది. ఆయన క్షేమంగా ఉండాలని కోరుతూ ఆలయాల్లో,చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 35 రోజులుగా రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్న చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని, త్వరలో విడుదల కావాలని వేడుకున్నారు. చంద్రబాబుకు ముప్పువాటిల్లితే ప్రభుత్వానిదే బాధ్యత అంటూ తెదేపా నాయకులు హెచ్చరించారు. శనివారం అద్దంకి మండల టీడీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ నేత్రుత్వంలో మోదేపల్లి గ్రామంలో పోలేరమ్మ తల్లి,శ్రీసీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబును అక్రమంగా నిర్బంధించి వైద్య చికిత్స అందించకుండా జగన్‌రెడ్డి కక్షసాధింపు చర్యలపై ప్రజలకు వివరించారు. సైకిల్ యాత్రలో పెద్ద ఎత్తున తెదేపా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

విశాలాంధ్ర-అద్దంకి ; పట్టణంలో అంతరాయంలేని మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ కార్యనిర్వహక ఇంజనీర్ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. ఉత్తర అద్దంకి సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న కొత్త ఫీడర్ పనులను, పరివర్తకముల మరమ్మతుల పనులను శనివారం ఇఇ ఎస్.మస్తాన్‌రావు పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా ఇచ్చుటకు నార్త్ సబ్‌స్టేషన్ నుండి కాకానిపాలెం వరకు, దక్షిణ సబ్ స్టేషన్ నుండి నాగులపాడు రోడ్డు వరకు కొత్తగా 11కెవి లైన్ వేస్తున్నట్లు తెలిపారు. దీనిద్వారా విద్యుత్ సరఫరా అంతరాయాలు గణనీయంగా తగ్గుతాయన్నారు. పట్టణంలో నాలుగు 63 కెవిఎ పరివర్తకాలు పెట్టుటకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ టి,సత్యన్నారాయణ, సహాయక ఇంజనీర్లు శివప్రసాద్, బాలకోటేశ్వరరావు, సబ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్లతో ట్రాఫిక్ సమస్యలు

విశాలాంధ్ర - చీరాల : పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తొలగించేందుకు ఏర్పాటు చేసిన డివైడర్లతో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ అన్నారు. శనివారం చీరాల మసీద్ సెంటర్‌లో దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో డివైడర్లు తొలగించాలని నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ పట్టణంలోని మసీద్ సెంటర్, గడియారం స్తంభం సెంటర్, ముక్కోణం పార్క్ సెంటర్ ఇతర ప్రాంతాల్లో డివైడర్ల పేరుతో రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలతో వాహనదారులు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన డివైడర్లు రోడ్లు ఇరుకై ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్నాయన్నారు.ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి ప్రజా శ్రేయస్సు దృష్టిలో పెట్టుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్, ఖాదర్, ఇబ్రహీం, నజీర్, బుజ్జి, జిలానీ బాషా, జుట్టు, ఆరిఫ్, నాయుడు, మోషే, శ్రీకాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే సామాజిక మార్పు

విశాలాంధ్ర - చీరాల : విద్య ద్వారానే సామాజిక మార్పు జరుగుతుందని కార్డ్స్ సంస్థ ఏసీఓ దేవమ్మ అన్నారు. శనివారం చీరాల ఉజిలి పేట లూదరన్ దేవాలయంలో కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాలబాట నిర్వహించి, అభివృద్ధి కార్యకర్తలకు ప్రొవిజన్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలబాట డిప్యూటీ డైరెక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ చీరాల కారంచేడు రోడ్డులోని, లూదరన్ దేవాలయంలో వివిధ పాఠశాలలకు చెందిన నాలుగవ తరగతి విద్యార్థులు గురుకుల పాఠశాలలో చేరేందుకు ప్రవేశ పరీక్షపై అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో కఠినంగా ఉండే లెక్కల పరీక్షకు సిద్ధం చేసేందుకు బాలబాట కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం 26 మంది అభివృద్ధి కార్యకర్తలకు ప్రొవిజన్ కిట్లు అందించారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ శీలమ్మ, ఏ.ఎన్.ఎమ్ ఆవుల కళ్యాణి,కార్డ్స్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ స్ఫూర్తితో సేవ కార్యక్రమాలు

విశాలాంధ్ర - చీరాల : భారత ప్రజల స్ఫూర్తి కెరటం, నేతాజీ సుభాష్ చంద్రబోస్, ధైర్య సాహసాలను, దేశ సేవను స్మరించు కుంటూ సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని నేతాజీ సేవా సమితి ప్రతినిధులు అన్నారు. ప్రతీ నెలా రెండవ శనివారం పేరాల చిన్న రథం కూడలిలో ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం పేదలకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రతినిధులు చుండూరి కృష్ణమూర్తి, పవని భానుచంద్రమూర్తి ,రామారావు, మణిబాబు,ప్రసాద్ సుబ్బారావు,రవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్బంధాన్ని ప్రజలు గమనిస్తున్నారు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వైకాపా ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఆధారాలు చూపకుండా నిర్బంధించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని నియోజకవర్గ తెదేపా ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య అన్నారు. స్థానిక కే.జీ.ఎం బాలికల ఉన్నత పాఠశాల నుండి ముంతావారిసెంటర్ వరకు,మండలంలోని విజయ నగర్ కాలనీలలో కరపత్రాలను పంపిణీ చేసి ఇంటింటికీ తిరిగి చంద్రబాబు అక్రమ అరెస్టుపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గజవల్లి శ్రీనివాసరావు,కౌతరపు జనార్ధన్ రావు,ఉసురుపాటి సురేష్, దగ్గుబాటి వెంకటరావు, కొండ్రు రత్నబాబు, కర్పూరపు సుబ్బలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదవటం మాకిష్టం

విశాలాంధ్ర - బల్లికురవ : దసరా సెలవులు సందర్భంగా శనివారం నుండి ఈనెల 24వ తేదీ వరకు బల్లికురవ గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు రమేష్ బాబు తెలిపారు.ప్రతిరోజు విద్యార్థిని విద్యార్థులకు కథలు చదివించడం,నీతి కథలు చెప్పటం,పుస్తక పఠనం అలవాటు చేయడం,శారీరిక మానసిక ఆనందం కోసం వివిధ రకాల ఆటలు,పాటలు పోటీలు నిర్వహించి ముగింపు రోజున బహుమతులు ప్రధానం చేయనున్నట్లు ఆయన తెలిపాడు.ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రమేష్ కోరారు.

విద్యుత్ చార్జీల బాదుడుతో సామాన్యుల నడ్డి విరుస్తున్న పాలకులు

విశాలాంధ్ర-అద్దంకి; విద్యుత్ సర్దుబాటు చార్జీలతో సామాన్య ప్రజలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నడ్డి విరుస్తున్నాయని జిల్లా సీపీఐ, సీపీఎం కార్యదర్శులు తన్నీరు శింగరకొండ, సీహెచ్ గంగయ్యలు దుయ్యబట్టారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల విధానం రద్దు చేయాలని, ట్రూఅప్ చార్జీల వసూళ్ళు నిలిపివేయాలని, స్మార్ట్‌మీటర్లు పెట్టరాదనే నినాదంతో ప్రజల్ని చైతన్యపరచి మరో విద్యుత్ ఉద్యమానికి ప్రజల్ని సిద్ధం చేసేందుకు శనివారం అద్దంకి పట్టణంలో వామపక్షపార్టీల నేతలు కరపత్రాలను పంపిణీ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ మాట్లాడుతూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచబ్యాంకు ఆదేశాలకు లొంగి విద్యుత్ రంగంలో సంస్కరణల పేరుతో చార్జీలు పెంచితే జనం తిరగబడ్డారన్నారు. నాటి ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిపక్ష ఎంఎల్ఏగా నిరాహారదీక్ష చేయడాన్ని గుర్తుచేశారు. కానీ నేడు ఆయన కుమారుడు వైఎస్ జగన్ ప్రజలు తిరస్కరించిన విధానాలనే అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వాల అవినీతిని అరికడితే కరెంట్ చార్జీలు పెంచకుండా తగ్గించవచ్చన్నారు. ఎలా తగ్గించవచ్చో విద్యుత్ నియంత్రణ మండలిలో వామపక్షాలు, ఇతర ప్రజాసంఘాల ప్రతినిధులు పలుసార్లు రాతపూర్వకంగా వివరించినా ప్రభుత్వానికి పట్టలేదన్నారు. ఇక ప్రభుత్వంపై పోరుతప్పదన్నారు. ప్రజలు మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు కెఎల్‌డిప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కందుల వినయ్‌కుమార్, సీపీఎం నాయకులు పనకా రామాంజనేయులు, తంగిరాల వెంకటేశ్వర్లు, రాయని వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్: రోజా

విశాలాంధ్ర - బాపట్ల : మహిళ పక్షపాతిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగి స్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖల మంత్రి ఆర్.కె. రోజా అన్నారు. కొండుబొట్లవారిపాలెంలోని ఉమ్మారెడ్డి వెంకయ్య కోటమ్మల జ్ఞాపకార్థం నిర్మించిన లక్ష్మీసమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ఆమె ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి మొక్కలు నాటి వెంకయ్య, కోటమ్మల స్మృతివనాన్ని ఆమె ప్రారంభించారు. స్మృతి వనం శిలాఫలకాన్ని ఆమె ఆవిష్కరించారు. ముందుగా జాతీయ రహదారి వద్దనుంచే మంత్రి రోజాకు గ్రామస్తుల నుంచి ఘన స్వాగతం లభించింది. చిన్నారుల నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ హిందూ ధర్మం పై ఆధారపడి అనుదిన జీవన విధానాలు ఉన్నాయని చెప్పారు. టీటీడీ ద్వారా రాష్ట్రంలో 1,800 దేవాలయా లను ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. అలాగే దేవస్థానాలను ప్రభుత్వం పరిరక్షిస్తుందని వివరించారు. ముఖ్యంగా పేదరికంతో బాధపడుతున్న అర్చకుల జీవితాల్లో వెలు గులు నింపేందుకు వారి వేతనాలను పెంచిందన్నారు. అర్చకుల జీవితాల్లో మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నగరి నియోజకవర్గం లోనూ పలు దేవాలయాలను ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. మహిళలను గౌరవించిన చోటనే అభివృద్ధి ఉంటుందని, ఆ రాష్ట్రం పురోభివృద్ధిలో ప్రయత్నిస్తుందన్నారు. మహి ళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంటులో చట్టం చేయగా నాలుగు సంవత్సరాల ముందుగానే రాష్ట్ర ముఖ్యమంత్రి ఏపీలో మహిళలకు అధిక రిజర్వేషన్లు కల్పించారని అభివర్ణించారు. విజయవాడలో 20 దేవాలయాలను గత ప్రభుత్వం తొలగిస్తే ప్రస్తుతం జగన్ పాలనలో ఆ దేవాలయాలన్నింటిని పునఃనిర్మిస్తున్నట్లు వివరించారు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తన తల్లి కోరికను తీర్చడానికి దిగ్విజయంగా దేవస్థానాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అన్ని సదుపాయాలతో దేవస్థానాన్ని నిర్మించి నట్లు ఏపీ లెజిస్లేటివ్ చీఫ్ విప్ ఉమారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. దేవాలయం నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం సంతోషదాయకమని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి అన్నారు. విగ్నేశ్వరుడు ఆలయంలో నిత్యం పూజలు జరిగేలా స్మృతి వనాన్ని ఏర్పాటు చేయడం ప్రజలకు ఎంతో మేలుకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సి.హెచ్ శ్రీధర్, డీ.ఈ.వో పీ.వీ రామారావు, పర్యాటక శాఖ అధికారి పి.సురేష్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర అభివృద్ధి : కృష్ణచైతన్య

విశాలాంధ్ర - బల్లికురవ : పేద బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందాలన్నా రాష్ట్రం అభివృద్ధి జరగాలన్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని శాప్ నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇంచార్జీ బాచిన కృష్ణచైతన్య అన్నారు.శనివారం మండల పరిధిలోని నక్కబొక్కలపాడు పంచాయతీ పరిధిలోని ఈర్లగంగమ్మ గుడి వద్ద వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని వారికోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు.పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా జగనన్న పని చేస్తున్నారన్నారు.సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ప్రతి ఇంటికి వెళ్లి వివరించేందుకు నవంబర్ ఒకటో తేదీ నుండి 40 రోజులు పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో కార్యక్రమం చేపట్టాలన్నారు. నియోజకవర్గ, మండల, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్థాయి వివిధ హోదాలలో ఉన్న నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు.గ్రామ వాలంటీర్లు, గృహసారథులు,సచివాలయ కన్వీనర్లు గడప గడపకు వెళ్లి జగనన్న నెరవేర్చిన హామీలను ఆ కుటుంబానికి జరిగిన మంచిని వివరించాలన్నారు.రానున్న సార్వత్రిక ఎన్నికలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరొకసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు అధ్యక్షులు సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య,ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి,జేసీఎస్ మండల కన్వీనర్ టి.నరేష్,ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి,మండల కోఆప్షన్ సభ్యులు షేక్ శ్రీనువలి,సర్పంచులు ధూళిపాళ్ల బుల్లిరామయ్య,జూపల్లి రాఘవరావు,పసల అంజలి నాగేశ్వరరావు, బండారు వెంకాయమ్మ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రి సెంట్రల్ జైలు ముట్టడిస్తాం

విశాలాంధ్ర - బాపట్ల : చంద్రబాబు ప్రాణాలు కాపాడదానికి రాజమండ్రి సెంట్రల్ జైలును ముట్టడించడానికి కూడా వెనకాడబోమని టీఎన్ఎస్ఎఫ్ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు మొవ్వ శరత్‌చంద్ర అన్నారు. శనివారం చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగా ఉండాలని జైల్ నుండి వెంటనే విడుదల అవ్వాలని టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బాపట్లలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆరోగ్యంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు.చంద్రబాబు అనారోగ్యంతో బాధపడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం సరైన వైద్యం అందించలేదన్నారు. వైద్యం అందించిన దాక్టర్లు కనీసం చంద్రబాబు పరిస్థితి ఏ విధంగా ఉందో ఆయనకు ఏ రకమైన వైద్య పరీక్షలు అందించారో ఏ మందులు ఇచ్చారో కనీసం చెప్పడం లేదన్నారు.ఏదోరకంగా చంద్రబాబు నాయుడును చంపాలనే కుట్రతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే ఉందన్నారు.రాష్ట్రంలో యువకులకు ఉద్యోగుల అవకాశాలు కలగాలన్న కార్మికులు కర్షకులు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని రాష్ట్రానికి అభివృద్ధి జరగాలన్న చంద్రబాబు నాయుడు సీఎం అయితే తప్ప రాష్ట్రం బాగుపడుతున్నారు. చంద్రబాబుకు మల్టీ సూపర్ స్పెషాలిటీ హస్పటల్ నుండి సరైన వైద్యం అంధించాలని డిమాండ్ చేశారు.చంద్రబాబు కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధమన్నారు.ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ బాపట్ల పార్లమెంట్ జనరల్ సెక్రటరీ యనుముల రాంబాబు,సెక్రటరీ పరీశా గోపి,సోషల్ మీడియా కో ఆర్డీనేటర్ మహేంద్ర,ఉడత దేవేందర్ బాలాజీ,పరీశా రమేష్, వి.మునేశ్వారరావు, ఆంధ్రేయ, తిరుపతి రావు, కే.శ్రీనివాసరావు, బి.గోపి, ఎ.రాజేష్ రెడ్డీ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బతికి ఉండగానే మరణదిన వేడుకలు

విశాలాంధ్ర - చీరాల : ఎవరైనా చివరికి చేరాల్సింది చితికేనని, బతికిన కొద్దికాలంలో సమాజానికి ఎంతోకొంత మంచి చేయాలని మాజీ మంత్రి పాలేటి రామారావు అన్నారు. శనివారం చీరాల టిటిడి కళ్యాణ మండపంలో పదకొండవ మరణ దినోత్సవ వేడుకలను మాజీ మంత్రి పాలేటి రామారావు తన అభిమానులు,హిందు,ముస్లిం,క్రైస్తవ మతాల గురువుల సమక్షంలో కేక్ కత్తిరించి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పాలేటి రామారావు మాట్లాడుతూ ప్రతి మనిషికి తన పుట్టుక,మరణం రెండు తెలిసి ఉండాలని, అప్పుడే మనిషి సంతోషంగా జీవించగలడన్నారు. తన పుట్టినరోజు ఫలానా అని పుట్టిన రోజు తెలిసి జరుపుకునేటప్పుడు,నేను ఫలానా సమయంలో చనిపోతానని తెలిసి మరణాన్ని కూడా గణించుకున్నప్పుడే మనిషి సన్మార్గంలో జీవిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కేర్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్,చీరాల నియోజకవర్గ పాస్టర్లు,పాలేటి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై మోయలేని భారాలు : జేబీ శ్రీధర్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోయలేని భారాలు మోపుతూ నడ్డి విరుస్తున్నారని సీపీఐ జిల్లా నాయకులు జెల్డి భాగ్య శ్రీధర్ అన్నారు. సీపీఐ పిలుపులో భాగంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి జగన్మోహన్ రెడ్డి బుద్ధి మార్చు కొని విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ కరపత్రం అందజేశారు. అనంతరం రథం బజార్ సెంటర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తూ క్షీర భావన్నారాయణ స్వామికి పెరిగిన విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని కరపత్రం అందించారు. ఈ సంద ర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తర్వాత ఒక మాట మాట్లాడుతున్నారని నేను అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచనని చెప్పి నేటికీ 7 సార్లు పెంచారన్నారు. 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ సర్దుబాటు చార్జీలు విద్యుత్ సుంకం పేరుతో పేద ప్రజల నడ్డి విరుస్తూ కేంద్ర ప్రభుత్వ అజెండా అమలు చేస్తున్న జగన్‌ను విద్యుత్ ఉద్యమం ద్వారా ఇంటికి పంపాలని శ్రీధర్ అన్నారు. రాష్ట్రంలో మరో బషీర్ బాగ్ తలపించేలా ప్రజలు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు మామిడి బత్తుల అశోక్, పూర్ణచంద్రరావు, ఫణి, శ్రీనివాసరావు, యలమంద జాన్సన్, సిపిఐ పార్టీ కార్యకర్తలు తదితురులు పాల్గొన్నారు.

రాయల్ స్కూల్‌లో దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర - మార్టూరు : స్థానిక రాయల్ స్కూల్ నందు చిన్నారులచే ముందస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు అమ్మవారి వేషధారణలో అందరిని అలరించారు. తల్లిదండ్రులు వారి చిన్నారులను అలంకరించడంలో మిక్కిలి ఆసక్తి కనబరిచారు.ఈ సందర్భంగా సంస్థ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పి.రవీంద్ర బాబు, పి.స్వప్న ,సంస్థ ఇంచార్జి కె.మధుబాబు చిన్నారులను అభినందించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు డివిబి సుబ్రహ్మణ్యం, చిన్నపిల్లల క్యాంపస్ ఇంచార్జి పి.కోటేశ్వరి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

విశాలాంధ్ర - మార్టూరు : మండలంలోని ద్రోణాదుల గ్రామానికి చెందిన యువకుడు శుక్రవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ద్రోణాదుల బిసి కాలనీకి చెందిన సిరికొండ వెంకటేష్ (29) మంగళగిరి నుండి బైకుపై శుక్రవారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై ద్రోణా దల వస్తున్న క్రమంలో చిలకలూరిపేట జాతీయ రహదా రిపై తిమ్మాపురం జంక్షన్ వద్ద వెంకటేష్ ద్విచక్ర వాహ నాన్ని లారీ ఢీ కొట్టడంతో రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది వెంకటేష్ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.మృతుడు వెంకటేష్‌కు భార్య బాలసరస్వతి 18 నెలల వయస్సు గల కుమార్తె పౌర్ణమి ఉన్నారు. శనివారం పోస్టుమార్టం అనంతరం వెంకటేష మృతదేహాన్ని ద్రోణాదుల తరలించారు.

ప్రజలకు సమాన హక్కులు కల్పించిన మహనీయుడు అంబేద్కర్

విశాలాంధ్ర - చీరాల : దేశంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో మానవ హక్కులకు భంగం కలగకుండా ముందుకు సాగాలని కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మోపర్తి జాన్ అన్నారు. స్థానిక ఎన్జీవో భవన్‌లో శనివారం ప్రజావేదిక రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి ఏసురత్నం ఆధ్వర్యంలో అంబేద్కర్ బౌద్ధం స్వీకరణ ఆవశ్యకత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, జిల్లా కలెక్టర్‌తో ఉత్తమ ప్రశంసాపత్రం పొందిన చీరాల మండల తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ మతం మనిషి కోసమే కానీ మనిషి మతం కోసం కాదని అంబేద్కర్ చెప్పారని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కుల కోసం నిరంతరం పోరాడారన్నారు. ఆనాటి పరిస్థితులలో ఉన్న పరిస్థితులను బట్టి ఎందరో తమ మతాలలో చేరాలని అంబేద్కర్‌ను కోరినప్పటికీ సమాజంలో ఉన్న రుగ్మతలను పారద్రోలేందుకు అంబేద్కర్ బౌద్ధం స్వీకరించారన్నారు. అనంతరం తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావును దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ ప్రభాకరరావు మాట్లాడుతూ అంబేద్కర్ ఒక సామాజిక ఇంజనీర్ అని ఆయన తనతోపాటు ఆరు లక్షల మంది అనుచరుల్ని, అనుయాయుల్ని బౌద్ధంలోకి మార్చారన్నారు. అంబేద్కర్ అనుచరులే ఇప్పుడు నియో బుద్దిస్టులుగా గుర్తింపు పొందారన్నారు. గతంలో ఉన్న మహాయానం,హీనయానం శాఖల్లాగ వీరిది నవయానం శాఖ అయ్యిందని, ప్రపంచాన్ని మానవీయ సమాజంగా తీర్చిదిద్దగలది కేవలం బౌద్ధమే అన్నది అంబేద్కర్ భావనని తను బౌద్ధం స్వీకరించి దేశ వాసులకు ఒక మంచి సందేశం ఇచ్చారని మంచి మార్గాన్ని చూపించానని ఎంతో ఆత్మ విశ్వాసంతో హుందాగా ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో దళిత మహాసభ నాయకులు నూకతోటి బాబురావు,గుమ్మడి రత్న ప్రకాష్,పీటర్ రమేష్ ,చిరంజీవి,చీరాల నియోజకవర్గ అంబేద్కర్ వాదులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పత్తి వ్యాపారులు దుర్మరణం

విశాలాంధ్ర - మార్టూరు : మార్టూరు జాతీయ రహదారిపై అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పత్తి వ్యాపారులు మృతి చెందారు. ఎస్సై కే కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం శ్యామల నగర్‌కు చెందిన బ్రహ్మారెడ్డి(62) రైలు పేటకు చెందిన చందా మల్లికార్జున్ రెడ్డి (50) ఇరువురు పత్తి వ్యాపారం చేస్తుంటారు వారికి రావాల్సిన వసూళ్ల నిమిత్తం వారం క్రితం నెల్లూరు వెళ్లి పనులు ముగించుకొని శుక్రవారం రాత్రి గుంటూరు కారులో తిరుగు ప్రయాణమవ్వగా జాతీయ రహదారి పక్కన స్థానిక సుధా లారీ కాటా సమీపంలో వీరి ముందుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించి ముందుకు వెళ్లే క్రమంలో రహదారి పక్కన ఆగి ఉన్న బాతుల లారీని బలంగా ఢీకొట్టారు. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం మొత్తం ధ్వంసమై లారీ కిందకు దూసుకు వెళ్ళి ప్రమాదంలో కారు ముందు భాగం సీట్లో కూర్చొని ఉన్న బ్రహ్మారెడ్డి, మల్లికార్జున రెడ్డిలో శరీర భాగాలు నుజ్జునుజై అలాగే ఉండిపోయారు. ముందుగా 108 సిబ్బంది నాగేశ్వరమ్మ, ఎస్సై కమలాకర్ తమ బృందంతో ప్రమాద స్థలంకు చేరుకొని గడ్డపారతో కారును లారీ నుండి వెలుపలికి లాగి డోర్లు పగలగొట్టి క్షతగాత్రులను బయటకు తీసుకొచ్చారు. పరీక్షించిన 108 సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుల బంధువులకు సమాచారం అందించిన ఎస్సై కమలాకర్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

హెల్మెట్ తప్పనిసరి: ఎస్పీ

విశాలాంధ్ర - బాపట్ల : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని పోలీస్ అధికారులు సిబ్బంది నో యాక్సిడెంట్స్ డే నిర్వహించారు. వాహనదారులకు రోడ్డు భద్రత నియమాల గురించి, హెల్మెట్, సీటు బెల్టు ధరించడం వలన కలిగే ఉపయోగాల వివరించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలను నడపడం వలన చోటుచేసుకునే రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన కల్పించి వారిచే రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతు రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్న వారిలో ఎక్కువ మంది ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారే ఉంటున్నారన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించాలని, అతి వేగం, మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, మీ భద్రత, మీ కుటుంబ క్షేమం దృష్టిలో ఉంచుకొని రోడ్డు భద్రత నియమాలు పాటిస్తు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్పీ సూచించారు.

సామూహిక పితృతర్పణాలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మహాలయ అమావాస్య పర్వదినం సందర్భంగా స్థానిక స్వర్ణ రోడ్డులోని బ్రాహ్మణ ఆరామ క్షేత్రంలో సామూహిక పితృతర్పణాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి ప్రగడ ఆంజనేయ శర్మ, శనగవరపు మల్లేశ్వర శర్మ,నారాయణలు కర్తలుగా వ్యవహరించారు.చీరాల బ్రాహ్మణ సమితి సభ్యులు కొణికి చంద్రశేఖర్,రాము పూజకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేశారు. అప్పాజోస్యుల సత్యనారాయణ, వడలి రాధాకృష్ణ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. అధిక సంఖ్యలో బ్రాహ్మణ సామాజిక వర్గ సభ్యులు కుటుంబ సమేతంగా ఈ పూజలలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అన్నంరాజు సుబ్బారావు,తాడేపల్లి విజయ్ కుమార్, కరవది భానుప్రకాష్ కుమార్, పవని భానుచంద్ర మూర్తి, ఎం.వి కృష్ణశాస్త్రి,అప్పాజోశుృల వెంకటేశ్వర్లు, కళ్యాణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండోమెంట్ ఈవో జ్యోతిపై సస్పెండ్ వేటు

విశాలాంధ్ర - యద్దనపూడి : దేవాదాయ శాఖ కారంచేడు గ్రూపు ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న డి.జ్యోతి కుమారిపై ఆ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం గతంలో యద్దనపూడి మండలంలోని పూనూరు, యణమదల గ్రూప్ దేవాలయాల ఈవోగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో 25 లక్షల రూపాయలకుపైగా నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆడిట్లో రుజువైన నేపథ్యంలో ఆమెను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.బడ్జెట్‌కు మించి నిధులు ఖర్చు చేయడం, విధులు పట్ల బాధ్యతారహితంగా ఉన్నందున, కౌలు వసూలు విషయంలో నిర్లక్ష్యంగా ఉండటం, వసూలు చేసిన సొమ్ము సకాలంలో బ్యాంకులో జమ చేయకుండా ఉండటం ఆమెపై ఆరోపణలు ఉన్నాయి.

అమ్మవారి ఉత్సవాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కర్లపాలెం : నల్లమోతువారిపాలెం గ్రామంలోని రామాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీదుర్గాభవానీమాత శరన్నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని సర్పంచ్ మాదా సుబ్రహ్మణ్యం కోరారు.ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను శనివారం గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిహోత్రం రామకుమార్ ఆధ్వర్యంలో ఈనెల15వ తేది నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఆదివారం ఉదయం గ్రామపెద్దలచే గణపతిపూజ, నవరాత్రి కలశ స్థాపన, మండపారాధన, అమ్మవారికుంకుమార్చన నివేదన, హారతి, మంత్రపుష్పం జరుగుతుందన్నారు. ప్రతిరోజు హూజా కార్యక్రమాలతోపాటు అమ్మవారి అలంకరణలు ఉంటాయన్నారు. చివరిరోజు అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. కావున భక్తజనం పెద్దసంఖ్యలో హాజరై ఆ ఉత్సవాలనువి విజయవంతం చేయాలని సుబ్రహ్మణ్యం కోరారు. కార్యక్రమంలో దొరికిన రామారావు,వీసాబత్తిన రాజశేఖర్, తాండ్ర సాంబయ్య, మాదా అంజయ్య మాదా వెంకటరామారావు, పెద్ది నాగు, సోమశేషయ్య, అగ్నిహోత్రం శ్రీరామకుమార్, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ

విశాలాంధ్ర - పిట్టలవాని పాలెం : మానవ సేవే మాధవ సేవ అని సద్గురు మధుసూదన్ సాయి అన్నారు. మండలంలోని ఖాజీపాలెంలోని అరవింద ఆశ్రమంలో సాయి స్వాస్థ్య వెల్‌నెస్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే కోన రఘుపతో కలిసి అయన హాస్పిటల్‌లోని అంబులెన్స్, కన్సల్టేషన్ రూం,రక్తపరీక్షల ల్యాబ్,ఈ.సి.జి, డిజిటల్ ఎక్స్‌రే రూంలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సద్గురు మధుసూదన్ సాయి మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా పేదలకు ఉచితంగా విద్య, వైద్యంను దేశంలోనే కాక విదేశాల్లో కూడా భగవాన్ సత్య సాయి బాబా ఆశీస్సులతో అందిస్తున్నామని చెప్పారు. మరో సంవత్సరంలో ఖాజీపాలెంలో తల్లీపిల్లల ఆస్పత్రిని నిర్మించి ఉచితంగా వైద్య సేవలు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఖాజీపాలెం పరిసర ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నందుకు సద్గురు మధుసూదన్ సాయికి అభినందనలు తెలిపారు.వారి శిష్య బృందానికి,హాస్పిటల్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. హాస్పిటల్ ఏర్పాటులో ముఖ్య భూమికను పోషించిన కరుణరాజు మాట్లాడుతూ ప్రస్తుతం హాస్పిటల్‌కి ప్రతిరోజు 50 నుంచి 60 మంది పేషెంట్లు వస్తున్నారని, హాస్పిటల్‌లో అన్ని సేవలు ఉచితమేనన్నారు. అందరి సహకారంతో హాస్పిటల్‌ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. తనకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్ స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో వడ్లమూడి సూర్యనారాయణ జ్ఞాపకార్థం బాపట్ల కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్ మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్ శనివారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 20 టీములు పాల్గొన్నాయి. భానుప్రతాప్ మాట్లాడుతూ 15 సంవత్సరాల తరువాత మరల ప్రారంభించడం చాలా సంతోషదాయకమని క్రీడలు మనసుకు శరీరానికి ఉల్లాసాన్ని ఉత్తేజాన్ని కలిగిస్తాయని పురపాలక సంఘ పాఠశాలకు క్రీడాకారులు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం పీడీ కత్తి శ్రీనివాసరావు క్రీడాకారులను కమిషనర్‌కి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో కె.తిరుపతిరావు, జి.రాధాకృష్ణ, పి.శైలజ కోచ్, కమిటీ మెంబర్స్ తిరుమల శెట్టి సాంబశివరావు, పూల నాగేశ్వరరావు, ఊస రాంబాబు, మామిడాల భార్గవ్, పాలగంజి సుబ్బారావు, విస్సర్ల విజ్ఞాన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.